సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం : 3 : జూలై : 2025



రొయ్య పిల్లా.. సిద్ధం చేయండిలా
రొయ్యల సాగులో రొయ్య విత్తనం కొనుగోలు నుంచి తిరిగి చెరువులో వదలడం ఎంతో కీలకమైన ప్రక్రియ. అయితే ఈ ప్రక్రియలో నిర్లక్ష్యంతో రైతులు నష్టపోతున్నారు. 8లో ▸



స్నేహితుడే హంతకుడు
డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా హత్యకు గురైన మృతుడి వివరాలు గుర్తించడంతో పాటు హత్యకు పాల్పడిన నిందితుడిని పశ్చిమ గోదావరి పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸



భవితకు బాటలు
రానున్నది కృత్రిమ మేథ శకమని అంచనా వేస్తున్న తరుణంలో విద్యార్థులు అటువైపు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇంజినీరింగ్‌లో ఆ కోర్సులను ఎంచుకుంటున్నారు. 8లో ▸

ఇదేం తీరువా బాబూ !

- రైతులపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే ఉచిత పంటల బీమాకు ఎసరు
- తాజాగా నీటి తీరువా వసూలుకు ఆదేశం
- రైతుల నుంచి రూ. 21.81 కోట్లు వసూలు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం
- నీటి తీరువా వసూలు చేయని గత వైఎస్సార్‌సీపీ సర్కారు



సాక్షి, భీమవరం: సూపర్ సిక్స్‌లోని అన్నదాత సుఖీభవ సాయం అందించకపోగా రైతులపై భారం మోపడమే పనిగా కూటమి పాలన సాగుతోంది. ఇప్పటికే గత ప్రభుత్వం తెచ్చిన ఉచిత పంటల బీమా పథకానికి ఎసరుపెట్టి ఏడాదికి దాదాపు రూ.28 కోట్ల ప్రీమియంను రైతులపై మోపింది. మరుగున పడిన నీటితీరువాను తాజాగా తెరపైకి తెచ్చి పన్నుల రూపంలో రూ.21.81 కోట్లు రైతుల నుంచి వసూలు చేసే పనిలో పడింది. తొలకరికి పెట్టుబడులకు సొమ్ములేక ఇబ్బందులు పడుతున్న రైతులకు వేలకు వేలు నీటి తీరువా చెల్లించాల్సి రావడం భారంగా మారింది. సాగునీటి సరఫరాకు గతంలో నీటి తీరువా పేరిట రెవెన్యూ శాఖ రైతుల నుంచి పన్ను వసూలు చేసేది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది ఈ సొమ్ములు వసూలు చేసేవారు. ఈ విధానంలో అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు ఉండటంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకురావాలని భావించినప్పటికీ రైతులకు ఊరటనిస్తూ ఆ ప్రక్రియను పక్కన పెట్టేసింది. వెబ్‌సైట్ సిద్ధం కాకపోవడంతో గత మూడేళ్లుగా నీటి తీరువా ఊసేలేకుండా పోయింది.

నీటి తీరువా భారం రూ.21.81 కోట్లు

అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేల సాయం అందిస్తామని చెప్పి గద్దెనెక్కిన కూటమి మొదటి ఇంతవరకూ చిల్లిగవ్వ ఇవ్వలేదు. తొలకరి పెట్టుబడుల కోసం సొమ్ముల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారి నుంచి నీటి తీరువా వసూళ్ల కోసం రెవెన్యూ శాఖకు ఆదేశాలిచ్చింది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయడం ద్వారా రెండు పంటలు పండే వ్యవసాయ భూములైతే ఎకరానికి మొదటి పంటకు రూ.200, రెండవ పంటకు రూ.150 వంతున మొత్తం రూ.350, ఆక్వా చెరువులకు ఏడాదికి ఒకే పంట లెక్కన ఎకరానికి రూ.500 వసూలుకు ఆదేశాలిచ్చింది. జిల్లాలోని 3,31,169 మంది రైతుల ఖాతాల నుంచి పాత బకాయిలు రూ.5.62 కోట్లకు వడ్డీ రూ.33.77 లక్షలు, ప్రస్తుత డిమాండ్ రూ.15.84 కోట్లు కలిపి రూ. 21.81 కోట్లు నీటితీరువా వసూలు చేయాల్సి ఉంది. ఈ మేరకు ఆర్డీఓలు, తహసీల్దార్లకు ఉత్తర్వులు రావడంతో పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. మూడేళ్లకు పాత బకాయిలు, వడ్డీలతో కలిపి ఒక్కసారే రైతుల నుంచి వేలల్లో వసూలు చేస్తున్నారు. పంట పెట్టుబడులకు సొమ్ములు లేక ఇబ్బందులు పడుతుంటే మూడేళ్ల బకాయి ఒక్కసారే కట్టాలని రెవెన్యూ సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆలస్యం చేస్తే పెనాల్టీతో చెల్లించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. అయినకాడికి అప్పులు చేసి చెల్లిస్తున్నామంటున్నారు. నీటి తీరువా మొత్తం రూ.21.81 కోట్లకు గాను ఇంతవరకు రూ.8.36 కోట్లు వసూలైనట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

సర్వీస్ ట్యాక్స్ అదనం

నీటి తీరువాతో పాటు రైతుల నుంచి సర్వీస్ ట్యాక్స్ వసూలు చేస్తుండటం గమనార్హం. పన్ను చెల్లింపు కోసం చేసే ప్రతి ట్రాన్సాక్షన్‌కు అదనంగా రూ.35 సర్వీసు టాక్స్ వసూలు చేస్తున్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి ట్యాక్స్‌లు చూడలేదని రైతులు వాపోతున్నారు.

బాదుడే.. బాదుడు

జగన్ సర్కారు 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తెచ్చిన విషయం విదితమే. ఈ క్రాప్ నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. కూటమి వచ్చాక ఈ పథకాన్ని ఎత్తివేయడంతో ప్రీమియం వాటాను రైతులే చెల్లించాల్సి వస్తోంది. ఎకరాకు పంట విలువ రూ. 41,000లో ప్రీమియంగా రెండు శాతం మొత్తం రూ. 820 బీమా కంపెనీకి చెల్లించాలి. దీనిలో ప్రభుత్వ వాటా 0.5 శాతం (రూ.205) కాగా, మిగిలిన 1.5 శాతం (రూ.615లు) రైతులే చెల్లించాలి. ఏడాదికి ప్రీమియం రూపంలో వరి రైతులపై రూ.28 కోట్ల భారం పడుతున్నట్టు అంచనా.

నీటి తీరువా డివిజన్ల వారీగా

రెవెన్యూ డివిజన్	రైతు ఖాతాలు	నీటి తీరువా మొత్తం
భీమవరం	99,329	రూ. 11.83 కోట్లు
తాడేపల్లిగూడెం	90,475	రూ. 4 కోట్లు
నరసాపురం	1,41,365	రూ. 5.98 కోట్లు

పంట చేతికొచ్చిన ఆనందం లేదు



గత ప్రభుత్వంలో నీటి తీరువా ఊసే ఉండేది కాదు. ఈ ప్రభుత్వం వచ్చాక పాత బకాయిలంటూ వడ్డీలు వేసి మరీ చెల్లించాలని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. మూడేళ్లకు కలిపి నీటితీరువా రూ. 21 వేలు చెల్లించాను. పంట డబ్బులు చేతికొచ్చాయన్న ఆనందం లేకుండా పన్నుకే సరిపోయింది.

– వెలగల వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెనుమంట్ర

రైతులపై భారం మోపుతున్నారు



రైతులను ఆదుకోవాల్సింది పోయి ఏదో రూపంలో ఈ ప్రభుత్వం మాపై భారం మోపుతోంది. ఉచిత పంటల బీమాను రద్దుచేయడంతో ప్రీమియం రైతులే చెల్లించుకోవాల్సి వస్తోంది. కొన్నేళ్లుగా నీటి తీరువా ఊసులేకుండా ఉంది. ఇప్పుడు వడ్డీలు, జరిమానాలు అంటూ రైతులపై భారం మోపుతున్నారు.

– కందుల సత్యనారాయణ, రైతు, వీరవాసరం

న్యూస్‌రీల్

మున్సిపల్ హైస్కూల్ తనిఖీ



చినరంగని పాలెం హైస్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: భీమవరం పట్టణంలోని చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్‌ను బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు మెనూ వివరాలను ఆరాతీసి వండిన పదార్థాలను రుచి చూశారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పెట్టే ఆహారంలో ఎలాంటి తేడా వచ్చినా ఉపేక్షించేది లేదని రోజువారీ మెనూ ప్రకారం అన్నీ తయారు చేసి పెట్టాలని ఆదేశించారు.

ధాన్యం సొమ్ములు తక్షణం చెల్లించాలి



భీమవరంలో రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న హరేరామ్

భీమవరం: కేంద్ర ప్రభుత్వం రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జరిగే సమ్మె జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం పట్టణంలో తాళ్లూరి హరిహర లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, రైతులకు రెట్టింపు ఆదాయం వచ్చేలా చూస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. ఆక్వా, కోకో, మామిడి రైతులు పూర్తిగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. దాళ్వాలో రైతులు విక్రయించిన ఇంతవరకు సుమారు రూ.300 కోట్లు చెల్లించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తుల శ్రీరామచంద్రుడు, కిలారి తవిటి నాయుడు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు స్కూళ్ల మూసివేత

భీమవరం: ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష చర్యలకు నిరసగా ఈ నెల 3న రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లను మూసివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీయూఎస్ఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు అక్కినేని కృష్ణకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది అధికారులు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలపై అతిగా స్పందించడం, త్రీమెన్ కమిటీలు, తనిఖీలు వంటి ఏకపక్ష నిర్ణయాలు దారుణమన్నారు.

ఇంటర్మీడియెట్ అధికారిగా ప్రభాకరరావు



ప్రభాకరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంటర్మీడియెట్ కార్యాలయ సిబ్బంది

భీమవరం: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా జి.ప్రభాకరరావు బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఆయన కార్యాలయ అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేశారు. తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఉపాధ్యాయుల అవార్డుల స్వీయప్రతిపాదన కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

భీమవరం: జిల్లాలో డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పరీక్షకు 98 శాతం హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఉదయం పరీక్షకు 385 మందికి 380 మంది హాజరుకాగా మధ్యాహ్నం 383 మందికి 378 మంది హాజరయ్యారన్నారు.

రేషన్ కందిపప్పునకు ఎసరు

- జిల్లాలో 5.58 లక్షల రేషన్ కార్డులు
- 600 టన్నుల కందిపప్పు అవసరం

భీమవరం: చౌక ధరల దుకాణాల ద్వారా అన్ని రకాల నిత్యావసరాలు అందిస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసిన టీడీపీ కూటమి కేవలం బియ్యం, పంచదారకే పరిమితమైంది. గతంలో చౌక డిపోల ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుములు పంపిణీ చేయగా కూటమి ప్రభుత్వం కందిపప్పుకు మంగళం పాడింది. జిల్లాలో సుమారు 5.58 లక్షల రేషన్ కార్డులకు ప్రతి నెలా దాదాపు 8,500 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉచిత బియ్యంతో పాటు రేషన్ కార్డుకు అర కిలో పంచదార రూ.17, కిలో కందిపప్పు రూ.67కు ఎండీయు వాహనాల ద్వారా ఇంటింటికి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు, మూడు నెలలు కందిపప్పు సరఫరా చేసి తరువాత చేతులెత్తేశారు. దీనితో పేదలు కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు అందించే కందిపప్పు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది.



ఎదురుచూపులే మిగిలాయి

కూటమి ప్రభుత్వం అన్ని నిత్యావసర సరుకులు చౌకడిపోల ద్వారా సరఫరా చేస్తుందని ఆశించిన ప్రజలకు కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇవ్వడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెలా దాదాపు 600 మెట్రిక్ టన్నుల కందిపప్పు సరఫరా చేయాలి. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.150 వరకు విక్రయించడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అంత ధర చెల్లించి కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం కిలో రూ.67కే పంపిణీ చేసే కందిపప్పు కోసం ఎదురుచూసినా నిరాశే మిగులుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కందిపప్పు, ఇతర నిత్యావసరాలు రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకు అందించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల బదిలీ అయినా.. రిలీవర్ లేక పాత స్థానాలలోనే కొనసాగుతున్న వివిధ కేడర్ల ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ విధానాలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

రొయ్య రైతుల నిరసన



నినాదాలు చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం నాయకులు

పాలకోడేరు: రొయ్యల తూకం సమయంలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. కాటా మోసంపై రొయ్య రైతుల సంక్షేమ సంఘం నాయకులు పాలకోడేరు మండలం గొల్లలకోడేరు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొంతమంది ట్రేడర్లు, కొనుగోలుదారులు రొయ్యలు కొనుగోలు చేసినప్పుడు కాటా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కాటా మోసానికి పాల్పడటం వల్ల టన్ను రొయ్యలకు 60 కేజీలు నష్టం పోతున్నామన్నారు. ఈ మోసాలు బయటికి రాకుండా కొందరు రకరకాల ఒత్తిళ్లకు, ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. కొందరు ట్రేడర్లు, కొనుగోలుదారులు కాటా ట్యాపరింగ్ చేస్తున్నారన్నారు. కేజీ రొయ్యలకు 60 గ్రాములు ఎక్కువ వచ్చే విధంగా కాటాను ట్యాంపరింగ్ చేస్తున్నారని, లీటర్లలో వెయిట్ పెట్టి, కిలోల్లో రొయ్యలను చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.గజపతిరాజు, ప్రధాన కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేరళ డీజీపీగా రావాడ చంద్రశేఖర్

స్వస్థలం వీరవాసరంలో ఆనందోత్సాహాలు



రావాడ చంద్రశేఖర్

వీరవాసరం: కేరళ రాష్ట్ర పోలీస్ బాస్‌గా పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరానికి చెందిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. కేరళ నూతన డీజీపీగా ఆయనను నియమిస్తున్నట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన విషయం తెలియడంతో చంద్రశేఖర్ స్వగ్రామం వీరవాసరంలో ఆయన బంధుమిత్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. 1991లో ఐపీఎస్‌కు ఎంపికైన చంద్రశేఖర్ కేరళ క్యాడర్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కేరళలో పోలీస్ ఉన్నతాధికారిగా పలు కీలక బాధ్యతల్లో పనిచేసి రాష్ట్రపతి నుంచి ఉత్తమ సేవల అవార్డును అందుకున్నారు. అక్కడ నుంచి డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లోకి వెళ్ళారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఇటీవలే సెంట్రల్ క్యాబినెట్ సెక్రటేరియట్ (స్పెషల్ సెక్యూరిటీ) కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆ బాధ్యతల్లో చేరకముందే.. కేరళ ప్రభుత్వం చంద్రశేఖర్‌ను డీజీపీగా ప్రకటించింది. ఒక రాష్ట్రానికి పోలీస్ బాస్ తమ ఊరి వ్యక్తి కావడంతో చంద్రశేఖర్ బంధుమిత్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. చంద్రశేఖర్‌కు ఆత్మీయులైన జీవీవీ ప్రసాద్, నేతల జ్ఞాన సుందర్రాజు, పీతల సుబ్రహ్మణ్యం, బాజింకి కృష్ణారావు, రాయపల్లి వెంకట్, నక్కెళ్ల వెంకట్, గూడూరి ఓంకార్, వీరవల్లి చంద్రశేఖర్, గుండా రామకృష్ణ, వీరవల్లి రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. కష్టపడే తత్వం ఉన్న ప్రతి ఒక్కరూ మహోన్నత వ్యక్తిత్వం గల చంద్రశేఖర్‌లా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. చంద్రశేఖర్ నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కాచెల్లెళ్లలో చిన్నవారు. ఇంటర్ వరకూ వీరవాసరంలోనే చదివారు. బాపట్లలో అగ్రికల్చర్ బీఎస్సీ, హైదరాబాద్‌లో అగ్రికల్చర్ ఎమ్మెస్సీ పూర్తి చేశారు. బంధువులు ఇళ్లలో వివాహాలు, ఇతర ఫంక్షన్లకు, సంక్రాంతికి తప్పనిసరిగా వీరవాసరం వస్తుంటారు. వీరవాసరంలోని కమ్యూనిటీ హాల్, రామాలయం, చర్చికి కుటుంబ సభ్యుల పేరిట పెద్ద మొత్తాల్లో ఆర్థిక సాయం చేశారు. రావాడ ఆజాద్ చంద్రశేఖర్ ఐపీఎస్ అధికారిగా ఎదగడం వీరవాసరానికి గర్వకారణమని, అందరితో చనువుగా ఉంటూ, చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా మనసు విప్పి మాట్లాడే మంచి మనిషని ఆయన స్నేహితుడు నేతల జ్ఞాన సుందర్రాజు అన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): జిల్లాలో భారీ వర్షాల కారణంగా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. మండల స్థాయి అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచామని, ఏమైనా సమస్యలు ఉంటే వారిని సంప్రదించాలన్నారు. ఎవరైనా ఫోన్ చేసినప్పుడు స్పందించకపోయినా, సమస్యను పరిష్కరించకపోయినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామన్నారు.

కోకో రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కోకో రైతులు

పెదవేగి: ఈ నెల 15 వరకు కిలో కోకో గింజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.50 ప్రోత్సాహంతో రూ.500 ధర రైతులకు వచ్చేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కొండలరావు పాలెంలో జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. కొండరాలవు పాలెం,రైతు సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగు నరసింహారావు అధ్యక్షతన కోకో రైతుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో అనేక చోట్ల కోకో రైతుల నుంచి సక్రమంగా దరఖాస్తులు తీసుకోకుండా ఇబ్బందులకు గురి చేయడం వల్ల ఇంకా గింజలు అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. కోకో రైతులు చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేసి కిలో కోకో గింజలకు రూ.50 ప్రోత్సాహం ఇస్తుందని, కంపెనీలు ఇస్తున్న ధర కిలోకు రూ.450 కలిపి రూ.500గా నిర్ణయించి జూన్ 30 వరకు కొనుగోలు చేశారని, మిగిలిన గింజలు కొనుగోలు చేసేలా ఈనెల 15 వరకు రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేలా ఫార్ములా రూపొందించాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం నాయకులు గుదిబండి వీరారెడ్డి,పాలడుగు నరసింహారావు, యరకరాజు శ్రీనివాసరాజు, కోనేరు సతీష్ బాబు, కొల్లె సత్యనారాయణ, బింగిన శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు

త్వరలో పోలీస్ అకాడమీ సెంటర్‌కు శంకుస్థాపన



నూగొండపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

ఆగిరిపల్లి: పోలీస్ అకాడమీ సెంటర్ నిర్మాణం కోసం త్వరలో శంకుస్థాపన చేస్తామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఏపీ పోలీస్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం బుధవారం మండలంలోని నూగొండపల్లి గ్రామంలో ఉన్న 94.49 ఎకరాల భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూగొండపల్లిలో పోలీస్ శిక్షణ సదుపాయాల కోసం త్వరలో అధునాతన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తామని తెలిపారు. పోలీస్ అకాడమీ సెంటర్ రాష్ట్ర పోలీస్ శాఖకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, డీఐజీలు జీవీజీ అశోక్ కుమార్, ఎం.రవి ప్రకాష్, సత్య ఏసుబాబు, ఎస్పీ కే. ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైసెన్స్ లేని వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు ప్రమాదకరం

భీమవరం: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమరేశ్వరన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు ప్రమాదకరమన్నారు. వేడుకలకు మద్యాన్ని తక్కువ ధరకు సరఫరా చేస్తామని చెప్పి మోసంచేసే అవకాశముందని హెచ్చరించారు. మద్యం అమ్మకాల్లో అనుమానిత వ్యక్తుల వివరాలను టోల్‌ఫ్రీ నంబర్: 14405, లేదా సెల్: 98482 03823 నంబర్‌కు సంప్రదించాలని కుమరేశ్వరన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. లక్కవరం ఎస్సై బి.శశాంక తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గౌతు వెంకట రామకృష్ణకు, నాగ వెంకట శిరీష (39)కు 19 ఏళ్ల క్రితం వివాహమైంది. మంగళవారం శిరీష, ఆమె అత్త కోడిపిల్లల విషయమై గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన శిరీష కలుపు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా, చికిత్స పొందుతూ శిరీష మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి కోరారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్ నందు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ని కోర్టుల్లో ఈనెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 4,633 రాజీకాదగిన కేసులు గుర్తించామని, వీటిలో 1,891 క్రిమినల్, 2,501 సివిల్, 241 ఇతర కేసులు ఉన్నాయన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు జిల్లాలో 34 బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కూడా తమ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కోర్సులు.. భవితకు బాటలు

- జిల్లాలో 6 కాలేజీలు.. 4,840 సీట్లు
- కృత్రిమ మేధ (ఏఐ) వైపు అందరి చూపు
- సీఎస్‌ఈకి తగ్గని క్రేజ్
- బ్రాంచ్ ఏదైనా పట్టు సాధిస్తే విజయ తీరాలకు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ తరువాత డిగ్రీ కోర్సుల వైపు వెళ్లడం గత రెండు దశాబ్దాల క్రితం ఉండేది. అప్పట్లో డిగ్రీలు, పీజీలు చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండేవి. దానికి తోడు సివిల్స్, ఏపీపీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే ఉద్యోగాలకు క్రేజ్ ఉండేది. అనంతరం విద్యా రంగంలో సమూల మార్పు వచ్చింది. సమాజంలో సాంకేతిక విప్లవం వేగంగా వ్యాప్తి చెందడంతో ఆ రంగంలో ఉపాధి అవకాశాలు అత్యధికంగా లభిస్తున్నాయి. దీనితో ఇంటర్మీడియెట్ తరువాత విద్యార్థుల తొలి ప్రాధాన్యత సాంకేతిక ఉన్నత విద్య ఇంజనీరింగ్ వైపే మొగ్గు చూపింది.

కృత్రిమ మేధ (ఏఐ) వైపు చూపు

రానున్నది కృత్రిమ మేధ శకమని నిపుణులు అంచనా వేస్తున్న తరుణంలో విద్యార్థులు అటువైపు ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా ఏఐ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్న అన్ని కళాశాలల్లోనూ, సీఎస్‌ఈతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ తదితర బ్రాంచ్‌లు సైతం పూర్తి సీట్లు భర్తీ కావడం చూస్తుంటే విద్యార్థులు ఏఐ వైపు ఎంత ఆసక్తిగా ఉన్నారో గ్రహించవచ్చు.

ఎవర్‌గ్రీన్‌గా మెకానికల్ బ్రాంచ్

ఏ కోర్సు తీసుకుంటే తేలికగా ఉత్తీర్ణులవడంతో పాటు చదువు పూర్తి కాగానే ఉద్యోగాలు లభిస్తాయా అనేది విద్యార్థులను వేధిస్తున్న ప్రధాన ప్రశ్న. ముఖ్యంగా మెకానికల్ ఇంజనీరింగ్‌కు ఎవర్ గ్రీన్ బ్రాంచ్‌గా గుర్తింపు ఉంది. ద్విచక్ర వాహనాల నుంచి విమానాల తయారీ వరకూ మెకానికల్ ఇంజనీర్ల ప్రాతే కీలకంగా ఉంటుంది. అలాగే కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితం సమ్మిళితంగా ఉండే కెమికల్ ఇంజనీరింగ్‌కు సైతం మంచి భవిష్యత్ ఉందని తెలుస్తోంది. డీఎన్ఏ సీక్వెన్సింగ్, మానవ జీనోమ్ ప్రాజెక్టు, జెనెటిక్ ఇంజనీరింగ్ వంటివి కెమికల్ ఇంజనీరింగ్‌లో మార్పులకు తెరతీశాయి.

సీఎస్‌ఈకే తొలి ప్రాధాన్యత

ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థుల్లో ఎక్కువమంది సీఎస్‌ఈలో చేరడానికే ఆసక్తి చూపుతారు. ఈ బ్రాంచ్‌తో ఐటీ కొలువులు, ఆకర్షణీయ ప్యాకేజీలు లభిస్తాయనే నమ్మకమే కారణం. అందుకు తగ్గట్టుగానే క్యాంపస్ రిక్రూట్‌మెంట్లలో ఐటీ రంగ కంపెనీలు ముందుగా సీఎస్‌ఈ విద్యార్థులకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. నాలుగేళ్ల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్ వర్కింగ్, అల్గారిథమ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్, ప్రోగ్రామ్ డిజైన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా బేస్, డేటా స్ట్రక్చర్స్ తదితర అంశాలను అధ్యయనం చేస్తారు.

ఈసీఈతో రెండురకాల లాభం

ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు రెండో ప్రాధాన్యంగా ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) నిలుస్తోంది. ఈ బ్రాంచ్‌లో ప్రధానంగా ఎలక్ట్రికల్ పరికరాలు, అనలాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్, శాటిలైట్ కమ్యూనికేషన్, మైక్రోవేవ్ ఇంజనీరింగ్, మైక్రో ప్రాసెసర్స్, మైక్రో కంట్రోలర్స్, ట్రాన్స్‌మీటర్, రిసీవర్, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరికరాల తయారీ, యాంటెన్నా, కమ్యూనికేషన్ సిస్టమ్స్ గురించి అవగాహన కలిగిస్తారు. ఈ బ్రాంచ్‌లో చేరడం వల్ల కోర్ సెక్టార్‌తో పాటు సాఫ్ట్‌వేర్ రంగాల్లోనూ కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

ట్రిపుల్ ఈలో 2 లక్షల ఉద్యోగాలు రెడీ

ప్రైవేట్ రంగంలో ఏర్పాటవుతున్న హైడల్ పవర్ ప్రాజెక్ట్ కారణంగా రానున్న నాలుగేళ్లలో రెండు లక్షల మంది ఈఈఈ ఇంజినీర్ల కోసం ఉద్యోగాలు ఎదురు చూస్తాయని నిపుణుల అంచనా. ఈఈఈ ద్వారా అటు ఎలక్ట్రికల్, ఇటు ఎలక్ట్రానిక్స్ రెండింటిపైనా పట్టు లభిస్తుంది. ఫలితంగా రెండు రంగాలకు చెందిన పరిశ్రమల్లో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అందుకే ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తుకు ఈ కోర్సు భరోసాగా నిలుస్తోంది. ఎలక్ట్రికల్ టెక్నాలజీ, మెషీన్, మోటార్లు, జనరేటర్లు, సర్క్యూట్ అనాలసిస్, పవర్ ఇంజనీరింగ్ తదితర అంశాలను ఇందులో చదువుతారు.

జిల్లాలో 6 ఇంజనీరింగ్ కళాశాలలు

ఏలూరు జిల్లాలో మొత్తం 6 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1,200 సీట్లు, రామచంద్ర కళాశాలలో 900, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 600, హేలాపురి కళాశాలలో 360 సీట్లు, ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ కళాశాలలో 1,360, నూజివీడులోని సారథి కళాశాలలో 420 సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్ల కోసం జిల్లా విద్యార్థుల నుంచి పోటీ తక్కువగానే ఉంటుంది. కాకపోతే ఇతర జిల్లాల విద్యార్థులు కూడా ఇక్కడి కళాశాలల్లో చేరేందుకు ఉత్సాహం చూపడంతో సీట్లు లభించడం కష్టతరంగా మారింది. ఈ ఏడాది నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షల్లో ఏలూరు జిల్లా నుంచి 4,700 మంది పరీక్ష రాయగా వారిలో ఇంజనీరింగ్ కోర్సుకు 3,409 మంది మాత్రమే అర్హత సాధించారు.

సృజనాత్మకతతో అద్భుతాలు



పదును పెట్టి నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులు అడుగులు వేయాల్సిన తరుణం ఆసన్నమైందని గుర్తించాలి. విద్యార్థులు తమ సృజనాత్మకతకు సాన పెడితే అద్భుతాలు సాధ్యమౌతాయి. అటువంటి విద్యార్థులు వారి అభివృద్ధితో పాటు దేశాభివృద్ధిలో కూడా తమ భాగస్వామ్యాన్ని ఘనంగా చాటిచెప్పే అవకాశం ఉంటుంది.

–డాక్టర్ కే వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు

బిడ్డకు జన్మనిచ్చి తల్లి మృత్యు ఒడికి



గర్భిణి మృతదేహం



సంగినీడి జయశ్రీ (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో డెలివరి సమయంలో బిడ్డకు జన్మనిచ్చి తల్లి మృత్యు ఒడికి చేరింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని 28వ వార్డుకు చెందిన సంగినీడి మనోజ్, జయశ్రీ (28) దంపతులు. ఎనిమిదేళ్ల క్రితం వేర్వేరు కులాలకు చెందిన వారు కావడంతో పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆరేళ్ల క్రితం వీరికి ఒక బాబు జన్మించాడు. అనంతరం మరో బిడ్డకు జన్మనిస్తూ జయశ్రీ దురదృష్టవశాత్తూ మృతి చెందింది. మంగళవారం స్కానింగ్ తీసుకుని రమ్మని వైద్యులు సూచించడంతో స్కానింగ్ తీసుకు వెళ్లారు. అంతాబాగానే ఉందని, నార్మల్ డెలివరికి రిపోర్టులు కూడా అనుకూలంగానే ఉన్నాయని వైద్యులు చెప్పడంతో మంగళవారం ఆసుపత్రిలో చేర్చారు. బుధవారం ఉదయం డెలివరి చేస్తుండగా పాప జన్మించినా తల్లి జయశ్రీకి అధికంగా బ్లీడింగ్ అవ్వడంతో మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. శిశువు పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం పిల్లల ఆసుపత్రికి తరలించారు. ఎంతో ఇష్టపడి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నామని, ఇటీవల ఆమె డీఎస్సీ పరీక్షలకు కూడా హాజరైందని, ఇంతలోనే ఇలా మృతి చెందిందని భర్త కన్నీరు మున్నీరుగా విలపించాడు.

స్నేహితుడే హంతకుడు

- కీలకమైన హత్య కేసును ఛేదించిన పోలీసులు
- డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నయీం అస్మి



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నరసాపురం: గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి, సదరు వ్యక్తి హత్య చేయబడ్డాడని నరసాపురం పోలీసులు నిర్ధారించారు. లోతైన దర్యాప్తు జరిపి హత్యగా తేల్చడమే కాకుండా డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా మృతుడిని గుర్తించడం విశేషం. దీనికి సంబంధించి వివరాలను బుధవారం ఎస్పీ నయీం అస్మి నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు.

పంట కాలువలో లభించిన మృతదేహం

నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలో డంపింగ్ యార్డ్ సమీపంలో పంట కాలువలో ఈ ఏడాది జనవరి 27వ తేదీన సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తొడ ఎముక, మరికొన్ని లోపలి అవయవాలను పోస్టుమార్టం సమయంలో భద్రపరిచారు. పోస్టుమార్టం నివేదికలో అతను నీటిలో పడిపోవడం వల్ల చనిపోలేదని తేలింది. పొట్టలో కుడివైపు గాయాలు కూడా ఉండటంతో హత్యచేసి పడేశారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

ఫోరెన్సిక్ ఆధారాలతో మృతుడి గుర్తింపు

పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హత్యపై కూపీ లాగారు. ముందుగా ఉభయ గోదావరి జిల్లాలు, పక్క జిల్లాల్లో నమోదైన మిస్సింగ్ కేసులు, అందులో గుర్తించిన వారి వివరాలు సేకరించారు. పెరవలి పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదై గుర్తింపు లభించని చుక్కల శ్రీనివాస్ విషయంలో దృష్టి పెట్టారు. శ్రీనివాస్ తల్లితండ్రుల డీఎన్ఏలను సేకరించి, మృతుడి భద్రపరిచిన ఎముక డీఎన్ఏ ద్వారా సరిచూసి మృతుడు శ్రీనివాస్‌గా నిర్ధారించారు.

హత్యగా గుర్తించింది ఇలా

పెరవలి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన చుక్కల శ్రీనివాస్ (37) డీఎస్సీకి ప్రిపేరవుతున్నాడు. అయితే అతని స్నేహితులు, దినచర్య వంటి అంశాలపై పోలీసులు దృష్టిపెట్టి విచారణ చేశారు. శ్రీనివాస్‌తో అత్యంతం సన్నిహితంగా ఉండే పెరవలి మండలం కాకరపర్రుకు చెందిన పూల వ్యాపారి మల్లెపూడి శ్రీనివాస్‌ను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా అతడే చంపినట్టు తెలిసింది.

స్నేహితుడే చంపేసి కాలువలో పడేశాడు

చుక్కల శ్రీనివాస్ డీఎస్సీకి ప్రిపేర్ కావడానికి రాజమండ్రి వెళతానని స్నేహితుడు మల్లెపూడి శ్రీనివాస్‌కు చెప్పాడు. అయితే వెళ్లొద్దని స్నేహితుడితో ఓసారి గొడవపడ్డాడు. మళ్లీ 2025 జనవరి 3వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో దువ్వ గ్రామం నుంచి ఒకే మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ఇదే విషయంపై మళ్లీ ఇద్దరూ వాదులాడుకున్నారు. పెరవలి సమీపంలో ప్లేబాయ్ ఫ్యాక్టరీ వద్ద నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి మోటార్‌సైకిల్‌ను తీసుకెళ్లి అక్కడ కొంతసేపు వాదులాడుకున్నారు. ఈ క్రమంలో మల్లెపూడి శ్రీనివాస్ బీర్‌బాటిల్ పగలకొట్టి చుక్కల శ్రీనివాస్ పొట్టలో కుడివైపుపొడిచి హత్య చేశాడు. కాళ్లు, చేతులు కట్టి, దుస్తులు తొలగించి శవాన్ని పెరవలి కాలువలోకి తోసేశాడు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే హత్య చేసిన ప్రదేశం నుంచి శవాన్ని కాలువలోకి నెట్టిన ప్రాంతం 3 కిలోమీటర్లు. 24 రోజుల తరువాత శవం దాదాపు 42 కిలోమీటర్లు దూరంలో కొప్పర్రు గ్రామంలో బయటపడటం మరో అంశం. ఇది దాదాపు అసాధ్యమైన కేసని వైద్య పరిజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసు ఛేదించినట్లు ఎస్పీ చెప్పారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ భీమారావు, నరసాపురం డీఎస్పీ డాక్టర్ బి.శ్రీవేద ఉన్నారు.

వేగవరం వద్ద భారీ రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో రోడ్డుపక్కనే ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీలు



గాయపడిన లారీ డ్రైవర్‌ను సీఐ వాహనంలో తరలిస్తున్న దృశ్యం

- దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీలు
- పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- ఇద్దరికి గాయాలు

జంగారెడ్డిగూడెం: జాతీయ రహదారి 516డి పై జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద బుధవారం భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒక లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, పదుల సంఖ్యలో వాహనాలు ధ్వంసమయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు సిమెంటు లోడుతో వెళుతున్న లారీని, ముంబయి నుంచి రాజమండ్రికి పేపర్ లోడ్‌తో వెళుతున్న లారీ మండలంలోని వేగవరం ప్రధాన సెంటర్ వద్ద వెనుక నుంచి ఢీకొంది. దీంతో సిమెంట్ లోడు లారీ అదుపుతప్పి రోడ్డు ఎడమపక్క ఉన్న దుకాణాల్లో దూసుకుపోయింది. ఇదే సమయంలో పేపర్ లోడ్ లారీ కుడి పక్కన దుకాణాల్లోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో పేపర్ లోడ్ లారీ డ్రైవర్ పప్పు పిన్నె బాయ్, అలాగే రోడ్డుపక్కనే ఉన్న కొప్పర్తి నాగేంద్రబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, సీఐ సుభాష్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తన వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కనే నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.

గ్రామస్తుల ఆందోళన

రహదారికి ఇరువైపులా దుకాణాలు ముందుకు వచ్చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వేగవరం గ్రామస్తులు ఆందోళన చేశారు. జాతీయరహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమణలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో సీఐ సుభాష్ మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

రొయ్య పిల్లా.. సిద్ధం చేయండిలా..

- రొయ్యల సాగులో ఎక్లిమెటైజేషన్ ప్రక్రియ తప్పనిసరి
- హేచరీ నుంచి రొయ్య విత్తనం సరఫరా కీలకం
- నిర్లక్ష్యంతో నష్టాల బారిన పడుతున్న రైతులు
- ఉమ్మడి జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు



హేచరీలో రొయ్య విత్తనాలను చెరువు నీటికి అలవాటు చేస్తున్న సంచుల పద్ధతి



రొయ్యల చెరువులో విత్తనాల బతుకుదలకు హోపాల పద్ధతి

కైకలూరు: రొయ్యల సాగును పసిబిడ్డను అమ్మ జాగ్రత్తగా సాకిన విధానంతో పోల్చుతారు. హేచరీలో రొయ్య విత్తనం కొనుగోలు నుంచి తిరిగి చెరువులో రొయ్య పిల్లలను వదలడం ఎంతో కీలకమైన ప్రక్రియ. పెనాయిస్ మోనోడాన్ (టైగర్ రొయ్యలు), లటోపెనియస్ వన్నామీ (వైట్ లెగ్ పసిఫిక్ రొయ్యలు) వంటి జాతుల పెంపకం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన రొయ్యల పరిశ్రమగా ఏపీ గుర్తింపు పొందింది. నాలుగు గోడల మధ్య తయారీ చేసిన రొయ్య విత్తనాలను ఆరుబయట చెరువుల్లో విడుదల చేస్తున్నప్పుడు యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో రొయ్య పిల్లలు మరణించి, రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి.

రాష్ట్రంలో 5.75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారు. వీరిలో రొయ్యల సాగు రైతులు 1.5 లక్షలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా వీటిలో రొయ్యల సాగు 1.10 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆక్వారంగం నుంచి వార్షిక ఉత్పత్తి 4 లక్షల టన్నులు ఉండగా, వార్షిక టర్నోవర్ రూ.18 వేల కోట్లుగా నమోదవుతోంది. రాష్ట్రంలో రెండు నెలల వ్యవధిలో సుమారు రూ.60 కోట్ల విలువైన రొయ్యలు చనిపోయాయి. రొయ్యల సాగులో ప్రధానంగా ఎంటిరోసైటటోజూన్ హెపాటోపెనాయ్(ఈహెచ్‌పీ), రన్నింగ్ మోర్టాలిటీ సింఢ్రోమ్(ఆర్ఎంఎస్), వైట్ స్పాట్ సింఢ్రోమ్ వైరస్(డబ్ల్యూఎస్ఎస్‌వీ), లూస్ షెల్ సింఢ్రోమ్(ఎల్ఎస్ఎస్) వ్యాధుల వల్ల రూ.కోట్లలో రైతులు నష్టాల బారిన పడుతోన్నారు.

ఎక్లిమెటైజేషన్ అంటే..

రొయ్యలు చెరువుల్లో సీడ్(రొయ్య విత్తనాలు)ను అలవాటు చేసే ప్రక్రియను ఎక్లిమెటైజేషన్ అంటారు. రొయ్యల ఆరోగ్యం చెరువు నీటి నాణ్యత, నిర్వహణ, వదిలే పిల్లల సంఖ్య, మేత నాణ్యత వంటి అంశాలపై ఆధారపడి ఉంటోంది. హేచరీలో రొయ్య విత్తనాలు అక్కడ ఉష్ణోగ్రత, సెలినిటీ(లవణీయత), పీహెచ్‌లకు అలవాటు పడి ఉంటాయి. వీటిని చెరువుల్లో వదిలే ముందు చెరువు నీటిలో ఉష్ణోగ్రత, పీహెచ్‌లకు తగ్గట్టుగా అలవాటు చేయాలి. హేచరీ నుంచి తెచ్చిన విత్తన సంచులను చెరువు నీటిలో అర్ధగంట కర్ర,తాడుతో కట్టివేయాలి. తర్వాత హేచరీ నుంచి తెచ్చిన సంచుల్లో స్థానిక చెరువు నీటిని నింపుతూ రెండు పర్యాయాలు చేయాలి. ఈ ప్రక్రియ అనంతరం విత్తనాలను చెరువులో వదలాలి. ఇలా చేయకుండా అనేక మంది రైతులు నేరుగా రొయ్య విత్తనాలను చెరువులో వదలడం వల్ల ఉష్ణోగ్రతలకు అలవాటు పడక రొయ్య పిల్లలు మరణిస్తున్నాయి.

రొయ్యల రైతులు ఇలా చేయండి

- రొయ్య విత్తనాలను చెరువులో వదిలేటప్పుడు ఉష్ణోగ్రత 28– 32 డిగ్రీల సెంటీగ్రేట్, పీహెచ్ 7.5–8.5, లవణీయత 15–35 పీపీటీ (స్థానిక పరిస్థితులను బట్టి), కరిగిన ఆక్సిజన్ 5 పీపీఎం కంటే ఎక్కువ ఉండాలి.
- రవాణా సమయంలో ఒత్తిడి తగ్గించడానికి రొయ్యల సీడ్‌ను శుభ్రమైన, ఆక్సిజన్ బ్యాగులు, సింటెక్స్ కంటైనర్లలో రవాణా చేయండి.
- ప్రతి 10–20 నిమిషాలకు 10–20 శాతం చొప్పున కంటైనర్, బ్యాగ్‌లలో చెరువు నీటిని కలపండి. ఇది రొయ్యలు క్రమంగా పీహెచ్, ఉష్ణోగ్రత, లవణీయతలో తేడాలకు అనుగుణంగా మారడానికి సహకరిస్తుంది.
- ఉష్ణోగ్రతను ట్రాక్ చేయడానికి థర్మామీటర్, లవణీయత కోసం రిఫ్రాక్టోమీటర్, నీటి విలువల కోసం పీహెచ్ మీటర్‌ను ఉపయోగించండి.
- సీడ్‌ను ఒకేసారి డంప్ చేసే బదులు చెరువు వాతావరణానికి సమర్థవంతంగా అనుగుణంగా ఉండేలా, వాటిని కొంత వ్యవధిలో చిన్న బ్యాచ్‌లుగా విడుదల చేయటం మంచిది.
- చెరువు నీటి నాణ్యత, ఉష్ణోగ్రత, లవణీయత, ఆక్సిజన్ స్థాయిలో మార్పులు ఎప్పటికప్పుడు గమనించాలి. రికార్డు చేయాలి.
- ఒత్తిడిని తగ్గించడానికి తక్కువ సంఖ్యలో రొయ్యలు విడుదల చేయాలి.
- వాతావరణానికి బాగా సర్దుబాటు అవుతున్నాయని నిర్ధారించుకోడానికి కొన్ని రోజుల పాటు రొయ్యల ఆరోగ్యం, ప్రవర్తన నిశితంగా గమనించండి.

బతుకు రేటు 90 శాతం మంచిది



హేచరీ నుంచి చెరువులో రొయ్య పిల్లలు వేసే సమయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. హోపా(విత్తనాల నిల్వ తొట్టె) బతుకుదలను 24 గంటలు కంటే 48 గంటల తర్వాత మాత్రమే తనిఖీ చేయాలి. సుమారు 200 విత్తనాలకు హోపాలో 180 విత్తనాలు జీవిస్తే అటువంటి వాటిని విడుదల చేయాలి. రొయ్య విత్తనాలను నేరుగా చెరువులో విడదల చేయకూడదు. పంట విజయానికి చెరువు నీటికి రొయ్య విత్తనాలను అలవాటు చేయడమే ఉత్తమ మార్గంగా రైతులు భావించాలి.

– డాక్టర్ పి.రామమోహనరావు, మాజీ డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ

6న ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు

భీమవరం: ఈనెల 6వ తేదీన జంతు సంక్రమణ వ్యాధి నిరోధక దినం (జూనోసిస్ డే) సందర్భంగా భీమవరంలోని ప్రాంతీయ పశువైద్యశాఖలో ఉదయం 9 గంటల నుంచి రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తామని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి సుధీర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు ప్రధానంగా రేబిస్‌వ్యాధి సోకుతుందని, ఈ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని రైతులు, జంతుప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సుధీర్‌బాబు కోరారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు



రామన్నపాలెం వద్ద అదుపుతప్పి పంట బోదెలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు

నరసాపురం రూరల్: ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. నరసాపురం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లే సమయంలో మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో బస్సులో ఉన్న 33 మంది విద్యార్థులు ఆర్తనాదాలు చేయడంతో అక్కడకు చేరుకున్న స్థానికులు స్పందించి పిల్లలను బస్సు నుంచి దించేశారు. ఈ ఘటనతో విద్యార్థులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

కొండ్రుప్రోలు సచివాలయానికి ఫర్నీచర్ బహూకరణ



సచివాలయానికి ఫర్నీచర్ అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు సచివాలయానికి అదే గ్రామానికి చెందిన పైబోయిన వెంకట్రామయ్య రూ.50,499లు విలువైన ఫర్నీచర్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రామయ్యకు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జనసేన ఇన్‌ఛార్జ్ కర్రి సురేష్, నాయకులు బొట్టా శ్రీను, పటాన్ వలీ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బుద్దాల వెంకట రమారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక భవిత కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు దాత, వైష్ణవ సంఘం నాయకులు కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మెరిట్ సాధించిన దివ్యాంగుల పిల్లలకు మెడల్స్, సర్టిఫికెట్స్, స్నాక్స్ అందజేశారు. బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకోవాలని, పిల్లలు విద్యా అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. యర్రా ఆంజనేయస్వామి, పీటీ వెంకన్న, గరికిపాటి బాపయ్య శర్మ, కోటి విజయ్ కిషోర్, ఎస్కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి పాల్గొన్నారు.

పూరీ, రామేశ్వరం యాత్రలకు ప్రత్యేక బస్సులు



గోడ పత్రికలు ఆవిష్కరించిన డిపో మేనేజరు గిరిధర్‌కుమార్ తదితరులు

తణుకు అర్బన్: తణుకు పరిసర ప్రాంత భక్తుల సౌకర్యార్థం ఆషాడమాసంలో పూరీ జగన్నాథ్, షడ్ షణ్ముఖ రామేశ్వరం యాత్రల స్పెషల్ బస్సులను తణుకు డిపో నుంచి ఏర్పాటు చేసినట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిదర్ కుమార్ తెలిపారు. భువనేశ్వర్, పూరీ, కోణార్క్, అరసవిల్లి, శ్రీకూర్మం పుణ్య క్షేత్రాలతో కూడిన పూరీ యాత్ర సూపర్ లగ్జరీ వీడియో కోచ్‌కు టికెట్ ధర కేవలం రూ. 3500 మాత్రమేనని, శ్రీకాళహస్తి, తిరుందతి, కంచి, స్వామిమలై, పూజచోమలై, మధురై, త్రిపుర కుందరం, రామేశ్వరం, తిరుచందూర్, కన్యాకుమారి, ఫళణి, తిరువాణమలై, శ్రీపురం, కాణిపాకం దర్శనం కొరకు ఏర్పాటు చేసిన షట్ షణ్ముఖ రామేశ్వరం 7 రోజుల యాత్రకు ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సుకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌తో కలపి టికెట్ ధర కేవలం రూ. 8వేలు మాత్రమే అని ఈ అవకాశాన్ని తణుకు పరిసర ప్రాంత భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఒకే ప్రాంతంలో 35 మంది భక్తులు ఉంటే వారు ఏ రోజు కావాలంటే ఆ రోజు బస్సు ఏర్పాటు చేస్తామని వివరాలకు 63042 10265 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా బుధవారం యాత్రలకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ గొల్లపల్లి మురళి, సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

మూసివేసిన వాటర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

ఆకివీడు: స్థానిక అనాల చెరువు గట్టుపై మూసివేసిన నాంది వాటర్ (లయన్స్) ప్లాంట్‌లో బుధవారం తెల్లవారుజామున మంటలు వ్యాప్తి చెంది ప్లాంట్ కాలి బూడిదైంది. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో నాంది వాటర్ ప్లాంట్ నడిపారు. ప్రజలకు రక్షిత నీరందించేందుకు నడిపిన వాటర్ ప్లాంట్‌ను కొన్నాళ్ల తరువాత మూసివేశారు. మరికొన్నాళ్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దీనిని నడిపారు. అయితే నష్టాలు రావడంతో మూసివేశారు. గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న ప్లాంట్ వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. మద్యం సేవించడం పరిపాటైందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్ వల్ల గానీ, మద్యం పోసి నిప్పంటిచి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. అగ్నిమాపక అధికారులకు తెలియజేయడంతో వాహనం ఆ ప్రాంతానికి వచ్చే అవకాశం లేనందున స్థానిక యువకులు పక్కనే ఉన్న చెరువులోని నీటిని బకెట్లతో పోసి మంటల్ని అదుపు చేశారు. అగ్నిమాపక అధికా రి జీ.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నిపుణులుగా ఎదగాలి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆదికవి నన్నయ్య ప్రాంగణంలో పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బుధవారం సహచర విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఒక ముఖ్యమైన మైలురాయిని విద్యార్థులు దాటినందుకు ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు.

నిండు ప్రాణాన్ని బలిగొన్న నిర్లక్ష్యం



తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో ఉదయం ఫ్లై ఓవర్ ప్రాంతంలో గోతులు పూడుస్తున్న దృశ్యం



తణుకు ఉండ్రాజవరం రోడ్డులో మంగళవారం రాత్రి రహదారిపై ఉన్న బురదను తొలగిస్తున్న దృశ్యం

- ప్రాణం పోయాక దిద్దుబాటు చర్యలు..?
- ప్రమాదంలో తీవ్రగాయాలైన యువకుడు మృతి
- ప్రయాణికుల ప్రాణాలకు రక్షణలేని దుస్థితి

తణుకు అర్బన్: ఒకవైపు వర్షాలు.. మరోపక్క గోతులు పడ్డ రోడ్లు.. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం .. వెరసి నిండు ప్రాణం బలైపోయి ఆ కుటుంబం రోడ్డున పడ్డ ఘటన తణుకులో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి తణుకు సజ్జాపురానికి చెందిన యువకుడు దూసనపూడి దుర్గాప్రసాద్ జంగం చెరువు వైపు నుంచి తణుకు వస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే సమయంలో ఇసుక లోడుతో ఉన్న టిప్పర్ పక్క నుంచే వెళ్తున్న పరిస్థితుల్లో బురదగాఉన్న రహదారిపై వాహనం అదుపు తప్పి లారీ కిందకు జారిపోయిన ఘటనలో దుర్గాప్రసాద్ రెండు కాళ్లు చిద్రమైపోయాయి. పరిస్థితి విషమించడంతో రాజమండ్రిలోని ఆస్పత్రికి చేర్చగా బుధవారం ఉదయం కన్ను మూశారు. దీంతో ఆ కుటుంబం తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయింది. తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లోని ఫ్లెట్టీవర్ పనుల్లో భాగంగా రెండు సర్వీసు రోడ్లు చిద్రమైపోయి గోతులు పడిపోయి బురదతో నిండిపోయి ప్రమాదకరంగా మారాయి. మరొకవైపు ఉండ్రాజవరం రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో భాగంగా రహదారిపై పేరుకుపోయిన బురదతో ప్రయాణికులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు ప్రాంతాలకు మధ్యలో ఉన్న 200 మీటర్ల ఉండ్రాజవరం రోడ్డులో ఏ పనిచేయనప్పటికీ సిమెంట్ రోడ్డులో బురద పేరుకుపోయి వాహనాలు అదుపుతప్పి పడిపోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. సరిగ్గా ఇదే ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుని యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. సమస్య కనిపిస్తున్నా గత వారం రోజులుగా ఇటు పాలకులు, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఒక నిండు ప్రాణం బలైపోయిందంటూ స్థానికులు, తణుకువాసులు ఆరోపిస్తున్నారు.

మేనెలలో మూడు ప్రమాదాలు..

ఈ ఏడాది మేనెలలో 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో వాహనం అదుపుతప్పి లారీ కిందకు జారిపోయిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే నెలలో ఫ్లెట్టీవర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటుచేసిన తాడును వేగంగా ఢీకొట్టి యువకుడు మృతిచెందాడు. గూడ్సు ఆటో తిరగబడి ఘటనలో వ్యక్తి గాయాలతో బయటపడ్డారు. ఇన్ని ఘటనలు జరుగుతున్నా కానీ ప్రయాణికుల సౌకర్యార్థం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా ఫ్లెట్టీవర్ నిర్మాణానికి సంబంధించి రెండు సర్వీసు రోడ్లు గుంతలు పడిపోయి తీవ్ర బురదమయంగా మారాయి. ఉండ్రాజవరం రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో భాగంగా రహదారిపై బురద పేరుకుపోయింది. దీంతో లారీలు, బస్సులు అధికసంఖ్యలో తిరుగుతుండడంతో టైర్లతోపాటు బురద రోడ్డు పొడవునా పాకేయడంతో గత వారం రోజులుగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం రాత్రి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనంతరం ఉండ్రాజవరం రోడ్డులో ప్రమాద ఘటన ప్రాంతంలో పేరుకుపోయిన బురదను వాటర్ ట్యాంకర్లు తీసుకువచ్చి కడిగించారు. ఫ్లెట్టీవర్ కింద ఉన్న రెండు సర్వీసు రోడ్లలోను ఉన్న గోతులను పూడ్చే ప్రక్రియ బుధవారం ఉదయం చేపట్టారు. దీంతో చేతులు కాలాక ఆకులు పట్టుకున్న తీరుగా ఉందంటూ ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఒంటరైన ఇద్దరు



రోడ్డు ప్రమాదంలో నిఖార్సైన నిర్లక్ష్యానికి మృత్యువాతపడిన సజ్జాపురవాసి దూసనపూడి దుర్గాప్రసాద్‌కు భార్య నాగ మాధురి, నాలుగు సంవత్సరాల కుమారుడు వెంకట కృష్ణ గంగాధర్ ఉన్నారు. తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న దుర్గాప్రసాద్ మరణం ఆ ఇరువురిని తీవ్రంగా కలచివేసింది. మేమెలా బతికేదంటూ దీనంగా చూస్తున్న వారి చూపులు అందరినీ కలచివేశాయి.

ఆరుగొలనులో గ్రామ సభ



ఆరుగొలను సచివాలయంలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ పీతల బుచ్చిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను సచివాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పీతల బుచ్చిబాబు మాట్లాడుతూ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్ఆర్ఈజీఎస్‌లో డ్రెయిన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సీ ఏరియాలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర మాట్లాడుతూ వారం రోజుల్లో గ్రామంలోని డ్రెయిన్లు శుభ్రం చేసి, పారిశుద్యాన్ని మెరుగుపరుస్తామన్నారు. ఆరుగొలను నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళడానికి బైపాస్ రోడ్డు నుంచి ఆరుగొలనుకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, ఈ మేరకు జాతీయ రహదారి శాఖ నుంచి అనుమతులు తీసుకురావాలని ఎమ్మెల్యే బొలిశెట్టిని కోరుతూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, మహిళా సమాఖ్య, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

'గూడెం'లో 12.2 మి.మీ వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడిచిన 24 గంటల్లో 12.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ బుధవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 8.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

న్యాయమైన కోర్కెలు తీర్చాలి



తణుకులో నిరాహార దీక్షల శిబిరంలో నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు



మునిసిపల్ కార్యాలయం వద్ద జేఏసీ దీక్షలు

తణుకు అర్బన్: మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవచూపాలని ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఉండ్రాజవరపు శ్రీను, ప్రధాన కార్యదర్శి గెల్లా విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం తణుకు మునిసిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన నిరాహార దీక్షల శిబిరంలో వారు మాట్లాడారు. ఇళ్లు గడవని పరిస్థితుల్లోనే తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెబాట పట్టామని, తక్షణమే ప్రభుత్వం తమతో చర్చలు జరిపి తమ న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు కృషిచేయాలని కోరారు. రూ. 13వేలు వేతనాలే అయినా ప్రభుత్వం నుంచి వచ్చే ఏ సంక్షేమం కూడా మాకు అందని దీన స్థితిలో ఉన్నామని వాపోయారు. కనీస వేతనాలు అందించే దిశగా ప్రభుత్వం తమకు సాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడాల దానం, సత్యనారాయణ, రాంబాబు, కాంతారావు, సుజాత, సూర్యలక్ష్మి, తేజ, రమణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆయా సమస్యలను తక్షణమే పట్టించుకొని, పరిష్కరించాలని, లేని పక్షంలో పోరాటాలు తప్పవు అని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పురపాలక సంఘం కార్యాలయం వద్ద బుధవారం 10వ రోజు రిలే నిరసన దీక్ష శిబిరం జరిగింది. నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీను, అడ్డాల చలపతి, ప్రత్తి రమేష్‌లు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్మికులు, మహిళా సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు పంపిణీ



తణుకులో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు అందుతున్న సహాయ సేవలు అజరామజరమని మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ కోడూరి రాధా పుష్పవతి అన్నారు. బుధవారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుగొండకు చెందిన శ్రీ వాసవి గీతా మహిళా సమాజం మహిళల సౌజన్యంతో ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రాధా పుష్పవతి మాట్లాడుతూ దివ్యాంగులు తమ అవసరాలు తీర్చుకునే విధంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ బొల్లా అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. దివ్యాంగుల సమస్యలను గుర్తించి దాతల సహకారంతో వారికి అందిస్తున్న వసతులు ఆలోచింపచేస్తున్నాయని అన్నారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ పెనుగొండకు చెందిన వాసవి కిట్టి, పూజా కిట్టి, వాసవి గీతా మహిళా సమాజం మహిళలు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందచేయడంతో వారి జీవనశైలిలో ఎన్నో మార్పులు వస్తాయని అన్నారు. దివ్యాంగులను ఆదుకునేందుకు ముందుకు వచ్చి అందించిన మహిళల సాయం అభినందనీయమన్నారు. అనంతరం అజ్జరం గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగ పిల్లలకు ఫౌండేషన్ ద్వారా రూ. 10వేలు చెక్కు, బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ జి.సత్యకుమారి, వికలాంగ సంఘ అధ్యక్షుడు వేంద్ర లక్ష్మణ్, మానేపల్లి కొండ రాజారావు, తణుకు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఫాస్ట చైర్మన్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. డైమండ్స్‌క్లబ్ 2025-26 సభ్యులు ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో కొపిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా మద్దుకూరి మెహర్ ప్రసాద్, కార్యదర్శిగా కోటి విజయ్ కిషోర్, అడ్మిన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడిగా కాళ్ల గోపికృష్ణ, చెన్నారెడ్డి సతీష్, మానేపల్లి వెంకట సునీల్ కుమార్, కోనా హనుమాన్, కేవీ కమల, బోళ్ల రాము, ఆకుల సతీష్, డాక్టర్ గురుస్వామిలు ఎంపికయ్యారు. నూతన కమిటీచే పదం కుమర్ గుప్తా విద్యా ప్రోత్సాహం క్రింద ప్రగతి కళాశాల సహకారంతో కంప్యూటర్, మానేపల్లి సునీల్, కోనా హనుమాన్‌లు సహకారంతో పేద మహిళకు కుట్టు మిషన్, లంకా శ్రీనివాస్ సహకారంతో క్యాన్సర్ రహిత శానిటరీ ప్యాడ్స్, పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో రైస్ బ్యాగ్, నిత్యావసర వస్తువులు పంపిణీ, కొప్పిశెట్టి రమణయ్య సహకారంతో పేద విద్యార్థికి రూ.11,000లు నగదు కాళాశాల ఫీజ్‌గా అందజేశారు. మాజీ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, ఉప గవర్నర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు, డాక్టర్లు మైథిలి, సూరపు రమాదేవి, కనీజ్ మహ్మద్, కోడూరి భాను సత్యనారాయణ, యోగ ట్రైనర్స్ చిక్కాల అంబికా, డాన్స్ టీచర్ శ్రీలలిత, ఆడిటర్ ఎస్‌వీ రమణారావు, నూకల నాగ మల్లేశ్వరరావు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు మదన్‌మోహన్ అగర్వాల్, డైమండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినులు పది పరీక్షా ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించి ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కందుకూరి పద్మావతి అన్నారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థినులు పడాల కావ్యశ్రీ 587 మార్కులతో నూజివీడు, కొలుకులూరి తన్మయ ప్రియ 580 మార్కులతో ఇడుపులపాయ, పాలాటి వర్షిణి 578 మార్కులతో శ్రీకాకుళం, తిరుపతిపాటి శ్రీవల్లి 578 మార్కులతో ఒంగోలు ట్రిబుల్ ఐటీల్లో సీట్లు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారిని బాగు చేయాలని ధర్నా

పాలకొల్లు సెంట్రల్: గోతులతో బురదమయంగా ఉన్న మట్టపర్రు రహదారిని బాగు చేయాలంటూ గ్రామస్తులు ధర్నా చేశారు. బుధవారం పోడూరు మండలం మట్టపర్రు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో రహదారిపై బైటాయించారు. దాదాపు మూడు గంటల సమయం ధర్నా నిర్వహించారు. ధర్నాతో పాలకొల్లు, మార్టేరు రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారిలో నిత్యం ప్రయాణం చేయలేకపోతున్నామని నాయకులు హామీలు ఇచ్చినంత వేగంగా పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ గంగాధరరావు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు కోరారు. బుధవారం మండలంలోని చిన తాడేపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ గంగాధరరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను అవలంబించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల పిచికారికి అవసరమైన డ్రోన్లను సైతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి వి.నారాయణ రావు మాట్లాడుతూ స్వర్ణ రకం వరి వంగడాన్ని సాగు చేసే రైతులు ఎకరానికి 20 కిలోల పొటాష్‌ను మొదటి కోటాలో వేసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో వాతావరణం దృష్ట్యా అవసరం మేర నత్రజని వాడుకోవాలన్నారు. పంట రుణం పొందిన రైతులు బ్యాంకును సంప్రదించి పంటల బీమా కట్టాలని, రుణం పొందని రైతులు పంటల బీమా కోసం రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, వ్యవసాయ విస్తరణాధికారి డి.విద్యాసాగర్, వీపీఏ టి.ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ఆరవల్లి గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటు

అత్తిలి: మండలంలో ఆరవల్లి గ్రామంలో తణుకు రూరల్ సీఐ ఆధ్వర్యంలో శాంతి కమిటీని ఏర్పాటు చేసినట్లు అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. ఆగ్రామంలో ఇటీవల రెండు వర్గాల మధ్య జరిగిన గొడవల విషయమై ఒకరినొకరు కించపరచుకుంటూ వ్యాఖ్యలు చేసుకోవడంతో పెద్దల సమక్షంలో శాంతి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై రెండు కులాలకు చెందిన వారు ఎటువంటి వ్యాఖ్యలు చేయరాదని అన్నారు. సోషల్ మీడియాలో గాని, పత్రికలలో గాని ఇకపై ఎటువంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రేమ రాజు తెలిపారు.

సుగర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



శిబిరంలో సేవలు అందించిన వారికి సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సుగర్ వ్యాధి పట్ల ప్రజలు, సుగర్ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారిచే జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు చిన్నం మునీంద్ర ఆధ్వర్యంలో కడకట్ల ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఉచిత సుగర్ వ్యాధి రక్త పరీక్షల శిబిరం జరిగింది. వక్తలు మాట్లాడుతూ సుగర్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హాజరైన వారికి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిలుగా డాక్టర్ అవినాష్, ఆశా దీప్తిలు హాజరై పలు సూచనలు అందజేశారు. ప్రతి రోజు తగిన వ్యాయమం, మిత ఆహారం తీసుకోవడం ద్వారా సుగర్ వ్యాధిని అదుపులో పెట్టుకోవచ్చునని చెప్పారు. వంద మంది పేషెంట్లు ఉచిత రక్త పరీక్షలు చేయించుకున్నారు. పాస్ట్ ప్రెసిడెంట్ రాజా, సిబ్బందిని సభ్యులు సత్కరించారు. కార్యదర్శి త్రిమూర్తులు, కోశాధికారి కిరణ్, ఎంజేఎఫ్ సుంకర శ్రీనివాస్, వంగపండు రామ్మోహన్‌రావు, ఆంజనేయులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు



పట్టణంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ

తణుకు అర్బన్: సీజనల్‌గా వచ్చే వ్యాధులను నిరోధించాలంటే ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పైడిపర్రు హైస్కూల్‌లో బుధవారం జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విజృంభించే డెంగీ నివారణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని, సమర్థవంతమైన ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే డెంగీ నివారణ సాధ్యమన్నారు. నిరూపయోగ కంటైనర్లలో మంచి నీటి నిల్వలు లేకుండా చేసుకోవడం ద్వారా దోమపుట్టుకకు చెక్ పెట్టవచ్చని, ప్రతి రోజూ డ్రైడే కార్యక్రమం ఒక శక్తివంతమైన విధానమని, వర్షాకాలం దోమల పుట్టుకకు అనువైన కాలమని అందువలన ప్రతి సీజన్‌లో చేతుల శుభ్రత, ఈగలు వాలకుండా ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై విధిగా మూతలు ఉంచాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని తద్వారా అతిసారం, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. జ్వరం ఉంటే సమీపంలోని వైద్యుల వద్దకు వెళ్లాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం ఎం .ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు హెల్త్ సెక్రటరీ వి.బులిపండు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమష్టికృషితో దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్, బేబి సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వన్య సిరిలు పేర్కొన్నారు. ఆరోగ్య అవగాహన, డెంగీ మాసోత్సవాలు సందర్భంగా బుధవారం పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు జరిగాయి. ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. నివాస ప్రాంతాలు వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తప్పక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ లార్వాలను నివారించేందుకు సమష్టి కృషి ఎంతో అవసరమని చెప్పారు. దోమలను నివారించడం ద్వారా డెంగీ, చికెన్ గునియా తదితర వ్యాధుల నుంచి రక్షణ పొందాలని పలు సూచనలు చేశారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ సెక్రటరీలు, ఆశాలు, ల్యాబ్ టెక్నీషియన్ పృధ్వి, హెల్త్ అసిస్టెంట్ కాంతారావు పాల్గొన్నారు.